ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 190

ఆదివారం 19 జూలై 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## గోదావరిలో గల్లంతైన ఐదుగురూ మృతి..

### చంద్రబాబు, పవన్ దిగ్భ్రాంతి

- పోలవరం జిల్లా ఎటపాక మండలంలో విషాదకర ఘటన
- గోదావరిన నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన గిరిజనులు
- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్న చంద్రబాబు
- ఈ ఉదంతం కలచివేసిందన్న పవన్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 18)

పోలవరం జిల్లా ఎటపాక మండలం గొల్లగూడెం వద్ద గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు స్థానికులు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు ఇలా మృత్యువాత పడటం అత్యంత విచారకరమని, బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే చంద్రబాబు అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గొమ్ముకొత్తగూడెం గ్రామానికి చెందిన తుర్రం భారతి, ఊకే సుశీల, ఊకే లక్ష్మి, బాన బోయిన బాలరాజు, ఊకే రమేశ్ అనే ఐదుగురు ఈ దుర్ఘటనలో మరణించినట్లు అధికారులు సీఎంకు తెలిపారు. బాధిత కుటుంబాలకు తక్షణమే అవసరమైన ఆర్థిక, నిత్యావసర సహాయ సహకారాలు అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు.ఈ దారుణ ఉదంతం తనను తీవ్రంగా కలిచి వేసిందనిపవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఆయన పోలవరం జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి, ఘటనకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ.. ప్రభుత్వం తరపున వారికి ఎలాంటి లోటు రాకుండా సహాయ చర్యలు ముమ్మరం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ ప్రమాదంపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఆమె ఫోన్‌లో మాట్లాడి ▶2లో

## 2027 నాటికి పోలవరం పూర్తి

### గుడివాడ సభలో చంద్రబాబు కీలక ప్రకటన

పట్టిసీమను 12 నెలల రికార్డు కాలంలో పూర్తి చేశామన్న సీఎం

తల్లికి వందనం పిల్లలందరికీ వర్తింప చేస్తామని స్పష్టీకరణ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 18)

ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి వంద శాతం పూర్తి చేసి తీరుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా గుడివాడలో పర్యటించిన ఆయన, అక్కడ జరిగిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' బహిరంగ సభలో మాట్లాడుతూ పోలవరం నిర్మాణ పనులను కూటమి ప్రభుత్వం అత్యంత శరవేగంగా ముందుకు తీసుకెళుతోందని ప్రకటించారు. గతంలో తాము కేవలం 12 నెలల రికార్డు కాలంలోనే పట్టిసీమ ప్రాజెక్టును పూర్తి చేసి కృష్ణా డెల్టాకు నీళ్లిచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రంలోని నదులన్నింటినీ అనుసంధానం చేయడం ద్వారా ఏపీలో కరవు అనే మాటే లేకుండా చేస్తామని భరోసా ఇచ్చారు. ▶2లో



# జీవన ప్రమాణాలు పెరిగితేనే నిజమైన అభివృద్ధి

బ్యాంకులు రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు

నరసరావుపేట మెగా రుణ వితరణ మహోత్సవంలో సీఎం చంద్రబాబు

కేంద్ర ఆర్థిక మంత్రితో కలిసి రూ.3,216 కోట్ల రుణాల అందజేత





(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 18)

'ప్రజల జీవన ప్రమాణాలు పెరిగితేనే నిజమైన అభివృద్ధి సాధించినట్లు. అదే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోంది. బ్యాంకులు రుణాలు ఇచ్చే సంస్థలు మాత్రమే కాదు.. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు. వారు ప్రజల వద్దకే వెళ్లి ప్రభుత్వ గ్యారంటీతో రుణాలు ఇవ్వడం, నిరుపేదలకు అండగా నిలవడం గొప్ప విషయం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో శుక్రవారం జరిగిన మెగా రుణ వితరణ మహోత్సవంలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో ▶2లో



## ఏపీలో విషాదం..

గోదావరిలో చేపలు పట్టేందుకు వెళ్లి ఐదుగురు గిరిజనుల మృతి

పోలవరం ఎటపాక మండలం గొమ్ముకొత్తగూడెంలో విషాదం

గోదావరి ప్రవాహ వేగానికి కొట్టుకుపోయిన గిరిజనులు

గల్లంతైన వారికోసం విస్తృత గాలింపు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 18)

ఆంధ్రప్రదేశ్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. పోలవరం జిల్లా ఎటపాక మండల పరిధిలోని గొల్లగూడెం సమీపంలో గోదావరి నదిలో ఐదుగురు గిరిజనులు గల్లంతయ్యారు. వారిలో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారు. ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానిక మత్స్యకారులు, ఈతగాళ్ల ▶2లో

## గిరిజన హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది





(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 18)

ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనుల రాజ్యాంగబద్ధ హక్కులు, భూములు, జీవనోపాధి, సమగ్ర సంక్షేమ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. గిరిజనుల భూముల్ని గిరిజనేతరులకు బదలాయించడాన్ని నిషేధించే 1/70 చట్టాన్ని సమర్థంగా అమలు చేస్తామని, ఇందులో ఎక్కడైనా ఉల్లంఘనలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు కారణంగా జీవో-3 అమలులో మార్పులు వచ్చినప్పటికీ వారి హక్కుల పరిరక్షణలో ప్రభుత్వం వెనక్కి తగ్గదని వెల్లడించారు. దీని కోసం చట్టబద్ధంగా సాధ్యమైన అన్ని చర్యలనూ ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. ▶2లో

## దేశాభివృద్ధిలో రైల్వేల పాత్ర కీలకం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 18)

'దేశాభివృద్ధిలో రైల్వే కీలకపాత్ర పోషిస్తుంది. అందుకే ప్రధాని నరేంద్రమోదీ రైల్వేవ్యవస్థ ఆధునికీకరణపై ప్రత్యేకదృష్టి పెట్టారు. బుల్లెట్ రైలు ప్రాజెక్టు గర్వకారణం. హైడ్రోజన్ రైళ్లతో పర్యావరణహిత రవాణా రంగంలో ప్రపంచానికి నాయకత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉంది' అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో రూ.12.56 కోట్లతో ఆధునికీకరించిన అమృత్ భారత్ రైల్వేస్టేషన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు.దీంతోపాటు ఎన్టీఆర్ జిల్లా రాయనపాడు, మార్కాపురం జిల్లా కంభం స్టేషన్లనూ ఆయన ప్రారంభించారు. మంగళగిరి కార్యక్రమంలో కేంద్ర సహాయమంత్రి, స్థానిక ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి లోకేశ్ పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో లోకేశ్ మాట్లాడుతూ.. 'రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ సారథ్యంలో రైల్వే ఆధునికీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. రాజధాని ▶2లో

## మోదీ దార్శనికతకు, భారతీయ ప్రతిభకు ప్రతీక

- విక్రమ్-1 రాకెట్ విజయంపై పవన్ కల్యాణ్
- తొలి ప్రయత్నంలోనే ఘన విజయం సాధించిన స్కైరూట్
- విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్
- సరికొత్త ఆవిష్కరణల్లో ప్రపంచ దేశాల సరసన భారత్ నిలుస్తుందన్న పవన్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 18)

భారత అంతరిక్ష పరిశోధన రంగంలో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ.. దేశంలోనే తొలిసారిగా ఒక ప్రైవేట్ ఏరోస్పేస్ సంస్థ 'స్కైరూట్' రూపొందించిన 'విక్రమ్-1' రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి 'మిషన్ ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ చరిత్రాత్మక ప్రయోగం విజయవంతం కావడం పట్ల ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ అద్భుత విజయాన్ని సాధించిన శాస్త్రవేత్తలకు, స్టార్టప్ బృందానికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.అంతరిక్ష సాంకేతికత, సరికొత్త ఆవిష్కరణల్లో ప్రపంచ దేశాల సరసన భారతదేశాన్ని అగ్రగామిగా నిలపడానికి ఈ ప్రయోగం ఒక చక్కటి నిదర్శనమని పవన్ కల్యాణ్ కొనియాడారు. ఈ విజయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టమైన దార్శనికతకు, ఆయన అందిస్తున్న ప్రోత్సాహానికి దక్కిన ప్రతిఫలమని అభిప్రాయపడ్డారు.స్పేస్ రీసెర్చ్ రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ఆహ్వానించడం ద్వారా దేశంలో సరికొత్త స్టార్టప్‌ల అభివృద్ధికి, యువతలో వ్యవస్థాపక స్ఫూర్తిని రగిలించడానికి కొత్త అవకాశాలు వచ్చాయన్నారు. పట్టుదల, వినూత్న ఆలోచనలు ఉంటే ప్రైవేట్ రంగంలోనూ అద్భుతాలు ▶2లో

## హస్తకళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూలై 18)

చేనేత, హస్తకళల అభివృద్ధికి, కళాకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తోందని చేనేత, జౌళి, బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. రూ.1.5 కోట్లతో ఢిల్లీ బాబా ఖరగ్‌సింగ్ మార్గ్‌లో పునరుద్ధరించిన లేపాక్షి ఎంపోరియాన్ని ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడారు. "దేశ-విదేశీ ప్రతినిధులకు అధికారిక బహుమతులుగా ▶2లో

## ఒడుదొడుకుల నుంచి ఆక్వాను గట్టెక్కించండి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 18)

ఆక్వా ఉత్పత్తులపై అమెరికా విధిస్తున్న సుంకాలతోపాటు.. రొయ్యల మేత తయారీకి ఉపయోగించే ముడి సరకుల ధరల పెరుగుదల కారణంగా రాష్ట్రంలో ఆక్వా రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని సీఎం చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకెళ్లారు. మేత తయారీ ముడిసరకుల ధరల్ని స్థిరీకరించేలా చర్యలు తీసుకోవాలని, రూ.100 కోట్ల కార్పస్ ఫండ్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రాన్ ప్రొడ్యూసర్స్ కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసేందుకు వీలుగా నిధులు మంజూరు చేయాలని కోరారు. రిలయన్స్ భాగస్వామ్యంతో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐఎస్ఏ) ఏర్పాటుకు ఆగస్టు 3న ఒప్పందం కుదుర్చుకుంటున్నామన్నారు. ఐఎస్ఏ ఏర్పాటులో కేంద్రం తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో నిర్మలా సీతారామన్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. ఆగస్టు 6-7 తేదీల్లో ఉద్యాన హబ్ పనుల ప్రారంభ కార్యక్రమానికి హాజరుకావాలని కేంద్ర మంత్రిని ఆహ్వానించారు. భేటీలో చర్చించిన ప్రధానాంశాలు.. ఈ ఏడాది జనవరి- ఏప్రిల్ మధ్య ఫిష్ మీల్ టన్ను రూ.1.55 లక్షల నుంచి రూ.2.40 లక్షలకు, చేప నూనె టన్ను రూ.2.80 లక్షల నుంచి రూ.4.40 లక్షలకు, సోయా లెసిథిన్ ▶2లో

మొదటిపేజీ తరువాయి

# జీవన ప్రమాణాలు పెరిగితేనే నిజమైన అభివృద్ధి

కలిసి 1.04 లక్షల మందికి రూ.3,216 కోట్ల విలువైన చెక్కులను అందజేశారు. బ్యాంకులు సీఎస్ఆర్ కింద అందించిన రూ.4.71 కోట్లతో పిడుగురాళ్ల వైద్య కళాశాలకు రెండు అంబులెన్స్‌లు, పర్యాటకశాఖకు రెండు బ్యాటరీ వాహనాలు, పాఠశాల విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు.

ముఖ్యాంశాలివీ..

పల్నాడు పౌరుషానికి శక్తిమంతమైన ఆయుధమిస్తున్నా

పల్నాడు అంటే పౌరుషానికి మారుపేరు. ఆ పౌరుషానికి శక్తిమంతమైన ఆయుధం ఇస్తున్నాం. మీరందరూ పారిశ్రామికవేత్తలు కావాలని సంకల్పిస్తున్నాం. పల్నాడు జిల్లాలో ఈ మెగా రుణవితరణ ద్వారా వ్యవసాయ రంగంలో 84,893 మందికి రూ.2,363 కోట్ల రుణాలు.. ఎంఎస్ఎంఈలో 4,449 యూనిట్లకు రూ.335 కోట్లు.. గృహ, విద్య, వాహన, సౌరవిద్యుత్తు వంటి 15,222 ఖాతాలకు రూ.624 కోట్లు.. వీటిలో వివిధ పథకాల కింద రూ.2,500 కోట్లు లబ్ధిదారులకు ఇచ్చాం. 15 వేల మంది డ్వాక్రా మహిళలకు, 13,355 మంది పారిశ్రామికవేత్తలకు రుణాలు అందించాం.

బ్యాంకింగ్ వ్యవస్థను తీర్చిదిద్దిన నిర్మలమ్మ

ఒకప్పుడు మైక్రో ఫైనాన్స్, ప్రైవేటు వడ్డీ వ్యాపారుల చక్రవడ్డీలతో జనం నలిగిపోయేవారు. బ్యాంకుల చొరవతో క్రెడిట్ ఔట్ రీచ్ ద్వారా వారి వేధింపులకు అడ్డుకట్ట పడింది. ఆ స్థాయిలో బ్యాంకింగ్ వ్యవస్థను తీర్చిదిద్దిన నిర్మలా సీతారామన్‌కు అభినందనలు. ఆమె బ్యాంకింగ్‌లో చాలా సంస్కరణలు తీసుకొచ్చారు. డిజిటల్ బ్యాంకింగ్ విప్లవం, జన్‌ధన్ యోజన ద్వారా కోట్ల మందికి బ్యాంకు ఖాతాలు ఇచ్చారు. ఈ తరహా క్రెడిట్ ఔట్‌రీచ్ కార్యక్రమాలు రాష్ట్రంలో ఆరుచోట్ల ప్రతి మూడు నెలలకు ఒకసారి చేపడతాం. నిర్మలా సీతారామన్‌కు జ్ఞాపిక అందిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో ఎమ్మెల్యేలు బ్రహ్మారెడ్డి, జీవీ ఆంజనేయులు

కేంద్ర ప్రభుత్వ సహకారంరాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో నుంచి బయటపడటానికి కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పూర్తిగా సహకరించారు. అమరావతికి రూ.15 వేల కోట్లు, పోలవరానికి రూ.12,157 కోట్లు ఇచ్చి వాటికి తిరిగి జీవం పోశారు. విశాఖ ఉక్కుకు రూ.11,440 కోట్లు ఇచ్చారు. ప్రపంచమంతా భౌగోళిక, రాజకీయ, వాతావరణ పరిస్థితులు బాగాలేకున్నా మోదీ సమర్థ నాయకత్వంతో మనం సురక్షితంగా ఉన్నాం.

మన పొదుపు మహిళలు దేశంలోనే మేటి

రాష్ట్రంలో పది లక్షల డ్వాక్రా సంఘాల్లోని 1.10 కోట్ల మంది సభ్యులు రూ.29 వేల కోట్ల పొదుపుతో దేశంలోనే మేటిగా నిలిచారు. బ్యాంకు రుణాల చెల్లింపులో 99.9%తో అగ్రస్థానంలో ఉన్నారు. ఈ ఏడాది 5 లక్షల మందిని పారిశ్రామికవేత్తలుగా తయారు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటోంది. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కోరినట్లుగా ప్రతి మండలానికీ డ్వాక్రా సంఘాలకు సోలార్ పార్కులు ఇస్తాం' అని చెప్పారు. కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎస్‌బీఐ రిటైల్ బిజినెస్, ఆపరేషన్స్ ఎండీ రామమోహనరావు పాల్గొన్నారు.

## గోదావరిలో గల్లంతైన ఐదుగురూ మృతి..

సహాయక చర్యలను పర్యవేక్షించారు. సాధారణంగా చేపల వేటకు వెళ్లే ప్రాంతంలో ఈ ప్రమాదం ఎలా జరిగిందనే కోణంలో సమగ్ర దర్యాప్తు జరపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు తక్షణ ప్రభుత్వ సాయం అందేలా చూడాలని జిల్లా యంత్రాంగానికి స్పష్టం చేస్తూ... మృతుల కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆమె ఆకాంక్షించారు.

## 2027 నాటికి పోలవరం పూర్తి

ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుపై స్పందిస్తూ.. ఈ నెల నుంచే రాష్ట్రంలో 'తల్లికి వందనం' పథకాన్ని ప్రారంభించబోతున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. కృష్ణా జిల్లాకు ఎంతో ఘనమైన చారిత్రాత్మక నేపథ్యం ఉందని కొనియాడిన ముఖ్యమంత్రి, అభివృద్ధిలోనూ ఈ ప్రాంతాన్ని ముందంజలో ఉంచుతామన్నారు. కేవలం ప్రాజెక్టులే కాకుండా నగరాలు, గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణతో పాటు 'చెత్త నుంచి సంపద సృష్టి' చేయడమే తమ కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.

## హస్తకళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

లేపాక్షి వస్తువులనే ఇస్తున్నాం. ఇవి పర్యావరణ అనుకూలంగా ఉంటాయి. లేపాక్షి సంస్థ రాష్ట్రవ్యాప్తంగా 16 షోరూమ్‌లను, దిల్లీ, హైదరాబాద్, కోల్‌కతాల్లో ఔట్‌లెట్లను నిర్వహిస్తోంది. వేలమంది కళాకారులకు జీవనోపాధి కల్పిస్తోంది. గతంలో లేపాక్షి షోరూమ్ వార్షిక టర్నోవర్ రూ.25–30 కోట్లు ఉండేది. ఇప్పుడు రూ.62 కోట్లకు పెరిగింది. కేంద్రం చేపట్టిన 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్' కింద దేశవ్యాప్తంగా 30 అవార్డులు ప్రకటిస్తే.. వాటిలో ఏపీకి పది వచ్చాయి. ఇది కూటమి ప్రభుత్వం కళాకారులకు ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనం. కళాకారుల నైపుణ్యాలు పెంచడానికి రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలో 20కి పైగా నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేసి వెయ్యిమందికి పైగా శిక్షణ ఇచ్చాం. విశాఖ సదస్సు, భారత్ టెక్స్ ప్రదర్శనల్లో ఆప్కో, లేపాక్షి ద్వారా మన కళాకారులు పాల్గొని అద్భుతమైన ఆర్డర్లు సాధించారు. ఈ రంగంలో సుమారు రూ.4,100 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇది రైజింగ్ ఆంధ్రప్రదేశ్ సాకారానికి దోహదపడుతుంది" అని మంత్రి సవిత పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ చేనేత, హస్తకళల అభివృద్ధి సంస్థ గౌరవ సలహాదారు సుచిత్ర ఎల్ల, చేనేత, జౌళిశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఆర్‌పీ సిసోదియా, ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్, ఏపీ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

వీటిపై కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఎవరూ నమ్మొద్దని గిరిజనులకు సూచించారు. ఏవైనా సందేహాలుంటే సంబంధిత ప్రభుత్వ అధికారులను సంప్రదించి సరైన సమాచారం తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఒడుదొడుకుల నుంచి ఆక్వాను గట్టెక్కించండి

టన్నుకు రూ.68 వేల నుంచి రూ.1.10 లక్షలకు చేరింది. మొత్తంగా టన్ను మేత రూ.25 వేల వరకు పెరగడంతో రైతులపై భారం పడింది. ఆక్వా ఉత్పత్తులకు దేశీయ మార్కెట్‌ను ప్రోత్సహించటం, రైతు ఉత్పత్తి సంఘాల ఏర్పాటు, మార్కెట్‌తో రైతుల అనుసంధానం, బ్రాండింగ్, ప్రాసెసింగ్, రిటైల్ ధరల ఏకీకరణకు మద్దతుతో పాటు అంతర్జాతీయంగా తలెత్తే ఒడుదొడుకుల నుంచి ఆక్వా రంగానికి రక్షణ కల్పించాలి. భారత్ నుంచి ఎగుమతయ్యే రొయ్యల్లో 80% ఏపీ నుంచే ఉన్నాయి. ఆక్వా ఉత్పత్తులపై అమెరికా విధిస్తున్న 30% సుంకాన్ని సున్నాకు తగ్గించేలా ఒత్తిడి తేవాలి. ప్రత్యామ్నాయ మార్కెట్లకు ఎగుమతి చేసే అవకాశాల్ని గుర్తించాలి.

సిగరెట్లపై భారీగా పెరిగిన ఎక్సైజ్ సుంకం, జీఎస్టీ భారంగా తయారయ్యాయని పరిశ్రమ వర్గాలు ఆందోళన చేస్తున్నాయి. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌ల్లో వ్యాపారులు పొగాకు కొనుగోళ్లను తగ్గించారు. ఈ ఏడాది 230 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి చేయగా ఇప్పటి వరకు కేవలం 34 మిలియన్ కిలోలే కొన్నారు. పొగాకు రైతును ఆదుకునేలా వెంటనే చర్యలు తీసుకోవాలి.

రాయలసీమ సమగ్ర ఉద్యాన అభివృద్ధి ప్రణాళికలో భాగంగా 2030 నాటికి సాగు విస్తీర్ణాన్ని 14.41 లక్షల హెక్టార్లకు, ఉత్పత్తుల్ని 435 లక్షల టన్నులకు చేర్చాలన్నది మా లక్ష్యం. దీనికి కేంద్ర సహకారం కావాలి.

## దేశాభివృద్ధిలో రైల్వేల పాత్ర కీలకం

అమరావతిని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్ నెట్‌వర్క్‌గా అభివృద్ధి చేస్తున్నాం. హైదరాబాద్‌ను చూస్తే నాలో కసి పెరుగుతుంది. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో కలిసికట్టుగా ఏపీని దక్షిణ భారతంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దుకుందాం. విశాఖ రైల్వేజోన్, విశాఖ ఉక్కు, పోలవరం ప్రాజెక్టు.. ఇలా రెండేళ్లలో ప్రధాని మోదీ ప్రోత్సాహంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశాం. రూపాయి ఆదాయం వస్తుంటే.. జీతాలు, సంక్షేమ పథకాల అమలుకు రూ.1.40 ఖర్చవుతుంది. అయినా వెనకడుగు వేయకుండా సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారు. వైకాపా హయాంలో పెట్టుబడులు, పరిశ్రమలు రాక రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. ఇప్పుడు రాయల్ ఎన్‌ఫీల్డ్, గూగుల్ వచ్చాయి. త్వరలో ఫైటర్ జెట్ తయారీ సంస్థ కూడా రానుంది' అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో అభివృద్ధి ఎలా ఉండాలో కుప్పాన్ని చూసి నేర్చుకోవాలని చెప్పేవారు. ఇప్పుడు ఆయనే మంగళగిరి వెళ్లి అక్కడ జరుగుతున్న అభివృద్ధిని చూసి నేర్చుకోవాలని చెబుతున్నారు' అని లోకేశ్ చమత్కరించారు. మంగళగిరి రైల్వేస్టేషన్‌ను ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందని పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.50వేల కోట్ల విలువచేసే రైల్వే పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. రాయనపాడు స్టేషన్ ప్రారంభోత్సవంలో ఎంపీ కేశినేని శివనాథ్, మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొనగా.. కంభం కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, గిద్దలూరు, కనిగిరి ఎమ్మెల్యేలు ఎం.అశోక్‌రెడ్డి, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, గుంటూరు ఏడీఆర్‌ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మోదీ దార్శనికతకు, భారతీయ ప్రతిభకు ప్రతీక

సృష్టించవచ్చని ఈ ప్రయోగం నిరూపించిందని, ఇది ప్రతి యువ భారతీయుడికి ఒక బలమైన సందేశాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రయోగాన్ని విజయవంతం చేయడంలో ప్రైవేట్ రంగానికి వెన్నుదన్నుగా నిలిచిన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) పాత్రను పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా ప్రశంసించారు. శాస్త్రీయ నైపుణ్యాన్ని అందిస్తూ యువతను ప్రోత్సహించడంలో ఇస్రో ఎల్లప్పుడూ ముందుంటుందని చెప్పారు. ఈ అద్భుత రాకెట్‌ను తయారు చేసిన 'స్కైరూట్ ఏరోస్పేస్' బృందంతో పాటు ఇస్రో, ఇన్–స్పేస్ సంస్థల శాస్త్రవేత్తలకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ విజయగాథ రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలిచి, అంతరిక్ష రంగంలో భారతదేశాన్ని మరిన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఏపీలో విషాదం..

### గోదావరిలో చేపలు పట్టేందుకు వెళ్లి ఐదుగురు గిరిజనుల మృతి

సహాయంతో గోదావరి నదిలో గల్లంతైన వారి కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. తీవ్ర గాలింపు అనంతరం వారి మృతదేహాలను వెలికి తీశారు. ఈ ప్రమాదం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే... నిత్యం వెళ్లేలాగే వీరంతా కలిసి గోదావరి నదిలో చేపలు పట్టేందుకు వెళ్లారు. అయితే నదిలో ఒక చోట అంచనా తప్పి, ఊహించని విధంగా నీటి లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతంలోకి దిగడంతో ప్రవాహ వేగానికి కొట్టుకుపోయారు. మృతి చెందిన వారందరినీ గొమ్ముకొత్తగూడెం గ్రామానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఒకే గ్రామానికి చెందిన వారు మృతి చెందడంతో ఆ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

## డ్రగ్స్‌కు దూరంగా ఉండేందుకు చట్టాల పై అవగాహన అవసరం

### వైద్యులు సమాజానికి ఆదర్శంగా నిలవాలి

### అడిషనల్ సివిల్ జడ్జి వి రామకృష్ణ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 18)

మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే మానసిక ఆరోగ్య సమస్యలు, వాటి దుష్పరిణామాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు, డ్రగ్స్‌ను చట్టవిరుద్ధంగా సరఫరా చేయడం, నిల్వ చేయడం, వినియోగించడం వంటి చర్యలకు చట్ట ప్రకారం విధించే కఠిన శిక్షలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండగలదని ఒంగోలు సివిల్ జడ్జి వి రామకృష్ణ పేర్కొన్నారు. సమాజంలో అత్యంత ప్రభావశీల వర్గమైన వైద్యులు, వైద్య విద్యార్థులు తమ ప్రవర్తనతో ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆయన సూచించారు. శనివారం ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలలో (జీఎంసీ) డ్రగ్ అవేర్‌నెస్ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సివిల్ జడ్జి వి రామకృష్ణ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా అప్రమత్తంగా ఉండాలని, చట్టాలపై అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరమని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ వైద్య విద్యార్థులు ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకొని సమాజానికి స్ఫూర్తిగా నిలవాలని, మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఇంచార్జీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల వ్యక్తి శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజం పైనా తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. మనోవైద్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సాయి కిరణ్ మత్తు పదార్థాల వల్ల కలిగే మానసిక ఆరోగ్య సమస్యలు, వ్యసనం లక్షణాలు, చికిత్సా విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మత్తు పదార్థాల అక్రమ రవాణా, సరఫరా, వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు తీసుకుంటున్న చర్యలు, చట్టపరమైన నిబంధనలు, శిక్షల గురించి వివరించారు. ప్రతి పౌరుడు డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. సైకియాట్రీ వైద్యులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. చివరగా డాక్టర్ శ్రీవిద్య అతిథులకు, పాల్గొన్న వైద్యులు, అధ్యాపకులు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

## స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ అవగాహన ర్యాలీ






(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జులై 18)

గ్రామాలను అత్యంత పరిశుభ్రంగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేద్దామని మండల ఎంపిడిఓ కె.ధనలక్ష్మి కోరారు. శనివారం మండలంలోని కడవకుదురు గ్రామంలోని ఎస్టీ కాలనీ నందు ప్రతీ నెలా మూడవ శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ప్లాస్టిక్ ని శాశ్వతంగా నిషేదిద్దామని మనం నిత్యం వాడే అవసరాల కోసం ప్లాస్టిక్ కాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ప్రజలను సూచించారు నిత్యవసరాలలో భాగంగా ఎన్నో రకాలుగా కవర్లు వాడుతున్నామని వాటి ప్లేస్‌లో క్లాత్ బ్యాగులను వాడాలని దాని ద్వారా భావితరాల ఆరోగ్య ప్రదాతలుగా నిలుస్తామని అన్నారు. చెత్తను తడి–పోడి చెత్తగా మార్చి ఆదాయ వనరుగా మార్చుకోవలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కె ధనలక్ష్మి, జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారి శ్రీనివాసరావు, ఎపిఓ లక్ష్మీకుమారి, సెక్రటరీలు నాగమల్లేశరరావు, ఎం రమణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వమే పొగాకును కొనుగోలు చేసేంతవరకు ఉద్యమాన్ని తీవ్రతరం చేద్దాం

### సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు జయంతి బాబు





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 18)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెయ్యి కోట్లు కేటాయించి పొగాకును కొనుగోలు చేయాలని, పొగాకు రైతు అప్పుల పాలవకుండా బయటపడాలంటే, సగటు క్వింటాల్ ధర 25 వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు, ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జే.జయంతి బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిట్టుబాటు ధర సాధించేంతవరకు ఉద్యమాన్ని కొనసాగించాలని, ఈ ఉద్యమానికి 27వ వేలం కేంద్రం పరిధిలోని వలేటివారిపాలెం, లింగసముద్రం, కందుకూరు మండలాల లోని గ్రామాల రైతులందరూ కలిసి రావాలని కోరారు. ఈరోజు ఉదయం కందుకూరు పట్టణంలోని, పామూరు రోడ్ లో గల 27వ పొగాకు వేలం కేంద్రాన్ని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా నాయకత్వ బృందం పొగాకు కొనుగోళ్లు ను పరిశీలించి, చుండి క్లస్టర్ రైతులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ పొగాకు ప్రభుత్వాలకు 90 వేల కోట్లకు పైగా లాభాలు వస్తాయని తెలిపారు. దాంట్లో నుండి అప్పుగా 1000 కోట్లు కేటాయించి ప్రభుత్వమే రైతుల వద్ద నుండి పొగాకును కొనుగోలు చేయాలని తద్వారా రైతులను ఆదుకోవాలని కోరారు. పొగాకు రైతుల ఆందోళన ఫలితంగా నో బిడ్ లు లేకుండా చేస్తామని, రైతుల వద్దనున్న పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. అనేక రోజులు గడుస్తున్నప్పటికీ రైతుల వద్దనున్న పొగాకును కొనుగోలు చేయడంలో వ్యాపారుల్లో ఎలాంటి మార్పు ప్రభుత్వం తీసుకురాలేకపోయిందని పేర్కొన్నారు. రైతులు పోరాటం చేయడం ద్వారానే ప్రభుత్వాన్ని మెడలు వంచగలమని, రెండవ దశ సాగే పోరాటంలో 27వ వేలం కేంద్రంలోని పొగాకు రైతులు అందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు జే జయంతి బాబుతో పాటు సభ్యులు వి హనుమారెడ్డి, జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, సిఐటియు నాయకులు జివిబి కుమార్, వాసుబాబు, తదితరులు పాల్గొన్నారు.





ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
19.07.26 ఆదివారం

# చుక్కల భూముల సమస్యను నెల రోజుల్లోగా పరిష్కరించేలా చర్యలు

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



(షణ్ముఖ వెలుగు, వలేటివారిపాలెం, జులై 18)

సమీరపాలెంలోని చుక్కల భూముల సమస్యను నెల రోజుల్లోగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు హామీ ఇచ్చారు. గ్రామంలోని ఇతర సమస్యలను కూడా సత్వరమే పరిష్కరిస్తామని చెప్పారు. శుక్రవారం రాత్రి వలేటివారిపాలెం మండలం సమీరపాలెం గ్రామంలో 'పల్లెనిద్ర' నిర్వహించి స్వర్ణ గ్రామ సచివాలయంలో బసచేసిన కలెక్టర్, శనివారం ఉదయం కూడా ప్రజల నుంచి అర్జీలు తీసుకుని గ్రామంలో పర్యటించారు. 'పల్లెనిద్ర' లో గ్రామస్తులు ప్రస్తావించిన పలు అభివృద్ధి సంబంధిత సమస్యలను స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ డి హిమవంశీతో కలిసి పరిశీలించారు. ఎస్సీ కాలనీలో గ్రామసభ నిర్వహించి 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమ ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్తులు ప్రస్తావించిన రెవెన్యూ సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టామన్నారు. ముఖ్యంగా చుక్కల భూముల సమస్యను 30 రోజుల్లోగా పరిష్కరిస్తానని చెప్పారు. ఆ తరువాత మరోసారి ఈ గ్రామాన్ని సందర్శిస్తానని ప్రకటించారు. గ్రామంలో పూర్తిస్థాయిలో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ కాలనీ నుంచి సచివాలయానికి వెళ్లేందుకు స్థానిక పంట కాలువ మీద కల్వర్టు కూడా నిర్మిస్తామని చెప్పారు. గ్రామంలోని ప్రధాన వాగు వెంట రైతులకు ఉపయోగపడేలా రోడ్డు నిర్మిస్తామన్నారు. ఎస్సీ కాలనీ ప్రజలు వెళ్లేందుకు స్మశానానికి దారి కల్పిస్తామన్నారు. ఎస్టీ కాలనీలో కూడా డ్రైనేజీల నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామానికి మంచినీటిని సరఫరా చేసే బావిని సందర్శించి మంచినీటి నాణ్యత పై కలెక్టర్ ఆరా తీశారు. కాగా, ఆయన సమక్షంలో ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది మంచినీటి పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న మంచినీటిలో మెండుగా పోషకాలు ఉన్నాయని, ఈ నీటినే తాగాలని ప్రజలకు ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. గ్రామంలో వీ.బీ.జీ. రామ్ జీ పథకం కింద చేపడుతున్న పనులను కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. లబ్ధిదారులతో వారు మాట్లాడారు. ముఖ హాజరు వేయటంలో ఎలాంటి ఇబ్బందీ లేదని, (తరువాయి 4లో...)




# బస్సు ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నాం

### మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, ఏపి మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 18)

సంతనూతలపాడు మండలం మద్దులూరు గ్రామ పరిధిలో రొయ్యల ఫ్యాక్టరీ రోడ్డు మలుపు వద్ద బస్సు ప్రమాదం జరగటం దురదృష్టకరమని, డ్రైవర్ అప్రమత్తంతో చిన్నచిన్న దెబ్బలతో బయటపడ్డారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, ఏపి మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య లు అన్నారు. బస్సు ప్రమాదంలో దెబ్బల తగిన క్షతగాత్రులను కొంతమందిని కొండేపి ప్రభుత్వం వైద్యశాలకు, మరి కొంతమందిని ఒంగోలు జిజిహెచ్‌కి తరలించడంతో వారిని పరామర్శించేందుకు జిజిహెచ్‌కి వచ్చి క్షతగాత్రులకు మనోధార్యాన్ని నింపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్దులూరు వైపు నుండి ఒంగోలు వస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ బస్సు మలుపు తిరిగే సమయంలో ప్రమాదానికి గురైందని అందులో 70 మంది ప్రయాణికులు ఉన్నారని అన్నారు. కొంతమంది విద్యార్థులు, ప్రయాణికులు ఉన్నారని తెలిపారు. కొంతమందిని కొండేపి ప్రభుత్వాసుపత్రికి, మరి కొంతమందిని మరి కొంతమందిని ఒంగోలు జిజిహెచ్ కి తీసుకురావడం జరిగిందని వారిని పరామర్శించామని పూర్తిగా కోలుకునేంతవరకు ఆసుపత్రిలోనే మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించడం జరిగిందన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా చర్యలు చేపడతామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా జరిగిన సంఘటన పై సమాచారం సేకరించడం జరిగిందన్నారు. క్షతగ్రాత్రులుకు (తరువాయి 4లో...)



# అద్దంకిలో కనుమరుగవుతున్న వైసిపి

### నిరుత్సాహంలో కార్యకర్తలు
### ప్రజల్లో గొట్టిపాటి రవికుమార్ కు పెరుగుతున్న గ్రాఫ్
### వైసీపీ కార్యకర్తలకు దగ్గర కానీ చింతలపూడి
### అసంతృప్తితో వైసిపి కార్యకర్తలు



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జులై 18)

రాజకీయాలకు పురిటి గడ్డ అయిన అద్దంకిలో మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ తర్వాత వైయస్సార్ పార్టీ కాంగ్రెస్‌కు మంచి ఓట్ బ్యాంకు ఉంది. అయితే ప్రస్తుతం మంత్రి గొట్టిపాటి రవికుమార్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత వైసీపీలో ఎమ్మెల్యేగా గెలిచాడు. తదనంతరం మారిన రాజకీయ పరిణామాలలో గొట్టిపాటి రవికుమార్ వైసీపీ నుంచి టిడిపిలోకి వెళ్లి వరుసగా బంపర్ మెజార్టీతో గెలుపొందుతూ వచ్చాడు. వైసీపీ కార్యకర్తలతో పాటు క్యాడర్ కూడా వివాదరహితుడు, సౌమ్యుడు గా రవికుమార్ కు మంచి పేరు ఉండటంతో ఆయనతోపాటు వెళ్లిపోయారు. అప్పటినుంచి అద్దంకిలో వైయస్సార్ పార్టీకి బలం తగ్గింది. 2019లో వైసిపి అధికారంలో ఉన్నప్పటికీ రవికుమార్ గ్రాఫ్ మరింత పెరిగింది. 2024 ఎన్నికల్లో వైసీపీ నుండి హనిమిరెడ్డి పోటీ చేసి రవికుమార్ చేతిలో ఓటమి చవి చూశాడు. ఆ తర్వాత వైసిపి పార్టీ,పల్నాడు జిల్లాకు చెందిన డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ ను ఇంచార్జ్ గా నియమించింది. ఈ క్రమంలో ఇంచార్జ్ లు మారినా నియోజకవర్గంలో వైసిపి పట్టు సాధించలేకపోయింది. డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ కార్యకర్తలకు దగ్గర కాకపోవటంతో వైసిపి మరింత బలహీన పడిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కార్యకర్తలు సైతం తమను ఆదుకునే నాయకుడు లేడు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ఉన్న నాయకులు ఫోటోలకే పరిమితం అవుతున్నారని, తమను పట్టించుకోవటం లేదని దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సామాన్య కార్యకర్తలు వాపోతున్నారు. ఇలాగైతే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ మునుగడ కోల్పోయే అవకాశం ఉందని వారు ఏకరువు పెడుతున్నారు. జగన్మోహన్ రెడ్డి 2.వా ద్వారా కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెబుతుంటే అద్దంకిలో పరిస్థితి మరోలా ఉందని మదన పడుతున్నారు. మండలాలలో సరైన మండల పార్టీ అధ్యక్షులు లేకపోవడం, గ్రామ నాయకత్వం కూడా పట్టించుకోవటం లేదని సగటు కార్యకర్త ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి అద్దంకి పై దృష్టి సారించి కార్యకర్తలకు పెద్దపీటవేసే నేతను రంగంలోకి దింపాలని వారు కోరుకుంటున్నారు.

# రాచర్ల కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి



## పాఠశాల నిర్వహణపై అసంతృప్తి



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జులై 18)

గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి శనివారం రాచర్ల మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యాబోధన, విద్యార్థినులకు కల్పిస్తున్న వసతి,భోజన సౌకర్యాలు, పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేసి, భోజనం నాణ్యత, పరిమాణం, మెనూ అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. శనివారం మెనూ ప్రకారం పాయసం అందించాల్సి ఉన్నప్పటికీ విద్యార్థినులకు అందించకపోవడం పై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతి రోజూ నాణ్యమైన, తగిన పరిమాణంలో భోజనం అందించాలని స్పష్టం చేశారు. పాఠశాలలోని మరుగుదొడ్లు, స్నానాల గదులను పరిశీలించిన ఎమ్మెల్యే వాటి నిర్వహణ పై అసంతృప్తి వ్యక్తం చేశారు. వాటిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. తరగతి గదుల్లో సరిపడా వెలుతురు లేకపోవడాన్ని గమనించిన ఎమ్మెల్యే, అవసరమైన చోట అదనపు లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే పనిచేయని ఫ్యాన్లను వెంటనే మరమ్మతులు చేయించి విద్యార్థినులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని సూచించారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులు, విద్యార్థినుల హాజరును తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, సిబ్బందితో సమావేశమై విద్యాబోధన నాణ్యత, విద్యార్థినుల సంక్షేమం, పాఠశాల పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాచర్ల మండల పార్టీ అధ్యక్షులు కటిక యోగానంద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, నల్లబోతుల శ్రీను, సంజీవ్, నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.




# రాగి తీగలు దొంగిలించే వారి పై కఠిన చర్యలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 18)

పొలాల్లో విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్లలోని రాగి తీగలను దొంగిలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు చెప్పారు. ఈ రాగిని కొనుగోలు చేసే వారిపైనా కేసులు పెట్టాలని అన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఇటీవల ఈ తరహా దొంగతనాలు ఎక్కువైన నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యల పై ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు, ఇరు జిల్లాల విద్యుత్ శాఖ జిల్లా అధికారులు, పోలీసు ఆఫీసర్లు, సంబంధిత అధికారులతో శనివారం ప్రకాశం భవనంలో ఆయన సమావేశం నిర్వహించారు. రెండు జిల్లాలలోని పరిస్థితిని విద్యుత్‌శాఖ ఎస్ఈలు కట్టా వెంకటేశ్వర్లు (ప్రకాశం), అబ్దుల్ కరీం (తరువాయి 4లో...)




# పేకాట శిబిరం పై మెరుపుదాడి

### రూ.2,38,450 నగదు, 12 ద్విచక్ర వాహనాలు, 12 మొబైల్ ఫోన్లు స్వాధీనం

## అర్హులైన ఖైదీలు ఉచిత న్యాయ సహాయం పొందేందుకు జిల్లా న్యాయ సేవా సంస్థను సంప్రదించాలి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 18)
ప్రకాశం జిల్లా న్యాయ సేవా సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఇన్‌చార్జ్ కార్యదర్శి సీహెచ్‌వి రామకృష్ణ జిల్లా కారాగారాన్ని సందర్శించి ఖైదీల సంక్షేమం, వారికి అందుతున్న న్యాయ సహాయం, వైద్య సేవలు, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఖైదీలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయం అవసరమైన ఖైదీలకు జిల్లా న్యాయ సేవా సంస్థ ద్వారా అన్ని విధాలా సహాయ సహకారాలు అందించబడతాయని తెలిపారు. అర్హులైన ఖైదీలు ఉచిత న్యాయ సహాయం పొందేందుకు సంకోచించకుండా జిల్లా న్యాయ సేవా సంస్థను సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా ఖైదీల హక్కులు, న్యాయ సేవలు మరియు పునరావాస అవకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఖైదీల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించి, వారికి అవసరమైన న్యాయ సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. జిల్లా న్యాయ సేవా సంస్థ ద్వారా కారాగార ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం, న్యాయ అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహించబడుతున్నాయని తెలిపారు. ఈ సందర్భనలో జైలు సూపరింటెండెంట్ రాజ్ కుమార్, జైలర్ అప్పలనాయుడు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ పి వీరరాఘవులు, జైలు విజిటింగ్ అడ్వకేట్లు శైలజ, మొబీనాబీ, ఎన్ ధనలక్ష్మి, పారా లీగల్ వాలంటీర్లు పి శ్రీనివాసరావు, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి

సీఐ మల్లికార్జునరావు





(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, జులై 18)
యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును సురక్షితంగా మలుచుకోవాలని కొరిశపాడు సీఐ మల్లికార్జునరావు సూచించారు. మేదరమెట్ల గ్రామంలో శనివారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెయింట్ ఆర్నాల్డ్స్ పాఠశాల విద్యార్థులతో గ్రామ ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి, అనంతరం బస్టాండ్ సెంటర్ కూడలిలో మానవహారం చేపట్టి మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మల్లికార్జునరావు మాట్లాడుతూ, యువతలో డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. నేటి యువత మాదకద్రవ్యాలకు బానిసై తమ జీవితాలతో పాటు కుటుంబాల భవిష్యత్తును కూడా ప్రమాదంలోకి నెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. మేదరమెట్ల ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తన, స్నేహితుల వర్గం, అలవాట్లపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని సూచించారు. అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సెయింట్ ఆర్నాల్డ్స్ పాఠశాల ప్రిన్సిపాల్ తామోస్ రెడ్డి, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# చుక్కల భూముల సమస్యను నెల రోజుల్లోగా పరిష్కరించేలా చర్యలు



చేయించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తీసుకుని సరుకులు అందించే స్వచ్ఛ రథాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని ప్రజలకు సూచించారు. ముర్రా బ్రీడ్ తో స్థానికంగా జన్మించిన గేదెలను కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. వాటి యజమానులతో మాట్లాడి మరింత పాల దిగుబడి కోసం దాణా అందించారు. రంగురంగుల కాగితాలతో తయారుచేసిన పూల బొకేలను చేత పట్టుకుని తాను బసచేసిన సచివాలయం వద్దకు వచ్చిన అంగన్వాడి చిన్నారులతో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఆప్యాయంగా వారిని పైకెత్తుకున్నారు. వయసుకు తగినట్లుగా పిల్లలు బరువు ఉండాలని,






పూర్తిస్థాయిలో పనులు లభిస్తున్నాయని కూలీలు తెలిపారు. పరిసరాలను శుభ్రంగా పెట్టుకుంటేనే మనకు ఆరోగ్యము, గౌరవం లభిస్తాయని కలెక్టర్ చెప్పారు. గ్రామానికి ఎస్.డబ్ల్యు.పి.సి షెడ్డును నిర్మిస్తామని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని, ప్రజలు కూడా తమ వంతు బాధ్యత నిర్వహించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని సూచించారు. తడి చెత్తను, పొడి చెత్తను ఇంట్లోనే వేరు చేయాలని చెప్పారు. ఈ దిశగా సహకరిస్తామని ప్రజలతో కలెక్టర్ ప్రతిజ్ఞ



అవసరమైన పోషకాహారం సమృద్ధిగా అందించాలని ఐసిడిఎస్ పిడి పద్మ సునందకు దిశా నిర్దేశం చేశారు. గ్రామ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిసరాల స్వచ్ఛత వలన ఆరోగ్యంగా ఉండవచ్చు అన్నారు. ప్రశాంతంగా ఉండే పల్లెటూరులో కూడా ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నారంటే ప్లాస్టిక్ వినియోగమే దీనికి ప్రధాన కారణం అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి పరిసరాలను శుభ్రంగా పెట్టుకోవాల్సిన ఆవశ్యకతను



తెలియజేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల మూడవ శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామాన్ని పరిశుభ్రంగా పెట్టుకోవాలని, గ్రామంలోని అభివృద్ధి, రెవెన్యూ సంబంధిత సమస్యలను జిల్లా యంత్రాంగం పరిష్కరిస్తుందని ఎమ్మెల్యే చెప్పారు. ఈ పర్యటనలో వారి వెంట డిపిఓ అనుపమ, జిల్లా స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో చిరంజీవి, డ్వామా పిడి జోసఫ్ కుమార్, డిఆర్డిఏ పిడి నారాయణ, పశు సంవర్ధకశాఖ జెడి వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్, స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# బస్సు ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నాం



అవసరమైనటువంటి ఎక్సరే, సిటీ స్కానింగ్, ఎమ్మారై, తీయించి మెరుగైన వైద్య సేవలు అందించి త్వరగా కోరుకునేలా చేయాలని అన్నారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి కూడా ఆర్టీసీ అధికారులతో మాట్లాడటం జరిగిందని దెబ్బలు తగిలిన వారికి భరోసా కల్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్ర మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, జనసేన పార్టీ నాయకులు ఉడా చైర్మన్ షేక్ రియాజ్, తదితరులు క్షతగాత్రులను పరామర్శించారు. బస్సు ప్రమాదం జరిగిందని తెలిసిన వెంటనే గాయపడిన వారు రిమ్స్ రాగానే ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ నామినేని కిరణ్, ఆర్ఎంఓ మాధవిలత కేర్ తీసుకొని డాక్టర్ లునీ అలర్ట్ చేసి వైద్యాన్ని అందించారు.









# రాగి తీగలు దొంగిలించే వారి పై కఠిన చర్యలు తీసుకోవాలి

(మార్కాపురం) వివరించారు. రాగి తీగలు దొంగతనానికి గురికావడం వలన ట్రాన్స్ఫార్మర్ మరమ్మతులు, పంట కోల్పోవడం వంటి రూపాలలో రైతులు నష్టపోతున్నట్లు వారు చెప్పారు. దీని పై కలెక్టర్ స్పందిస్తూ రాగి తీగలను దొంగిలించే వారితో పాటు, వాటిని కొనుగోలు చేసే వారిని కూడా ఈ నేరంలో భాగస్వాములను చేయాలని చెప్పారు. రాగి వ్యాపారం, ఇతర స్క్రాప్ వ్యాపారం చేసేవారు ప్రత్యేకంగా రాగి విక్రయం, కొనుగోలుకు సంబంధించిన లావాదేవీలను తెలిపేలా రిజిస్టర్లు నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ దిశగా చర్యలు తీసుకునేలా వాణిజ్య పన్నుల అధికారులతో విస్తృత సోదాలు చేయిస్తానన్నారు. పొలాల్లో ఇలాంటి దొంగతనాలను అరికట్టేందుకు విద్యుత్ అంతరాయం వస్తే తక్షణమే ట్రాన్స్ఫార్మర్‌ను పరిశీలించేలా స్థానిక పంచాయతీ కార్యదర్శి, విద్యుత్తు లైన్ మన్, నలుగురు రైతులు, ఒక కానిస్టేబుల్‌తో ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరైనా ట్రాన్స్ఫార్మర్ చుట్టుపక్కల సంచరిస్తే ఈ కమిటీ సభ్యుల మొబైల్ ఫోన్లకు మెసేజ్ రావడంతో పాటు ట్రాన్స్ఫార్మర్ వద్ద సోలార్ లైటు, సిసి కెమెరా ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలని విద్యుత్ శాఖ అధికారులకు కలెక్టర్ చెప్పారు. దొంగతనాలు జరిగేందుకు ఎక్కువ అవకాశం ఉన్న ట్రాన్స్ఫార్మర్లను కూడా గుర్తించాలన్నారు.

జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రాగి తీగల దొంగతనం కేసులలో నిందితులకు కౌన్సెలింగ్ ఇస్తామని, దోషులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అవసరమైతే పీడీ కేసులు కూడా పెట్టే విషయాన్ని పరిశీలిస్తున్నామన్నారు. స్క్రాప్ వ్యాపారులకు కూడా తాగి తీగల కొనుగోలు విషయాలలో అవగాహన కల్పిస్తామని, ఆధారాలు లేకుండా వీరి వద్ద రాగి లభ్యమైతే కేసులు పెడతామని చెప్పారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పివి రమణ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో చిరంజీవి, డిపిఓ అనుపమ, డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పేకాట శిబిరం పై మెరుపుదాడి

(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, జులై 18)
మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో పేకాట శిబిరం పై పొదిలి సిఐ ఎం రాజేష్ కుమార్, పొదిలి ఎస్ఐ సూరెడ్డి రాజేష్ సిబ్బందితో కలిసి మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్నటువంటి 13 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.2,38,450 నగదు, 12 ద్విచక్ర వాహనాలు, 12 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో సిఐ, ఎస్ఐ వెంట పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# టంగుటూరు ఎంపీడీఓ కార్యాలయంలో విజయవంతంగా నిర్వహించిన మెగా జాబ్ మేళా








(షణ్ముఖ వెలుగు, కొండపి, జులై 18)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో టంగుటూరు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా శనివారం విజయవంతంగా ముగిసింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువతీ, యువకులు హాజరై ప్రముఖ సంస్థల ఇంటర్వ్యూలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం యువతకు నైపుణ్యాభివృద్ధితో పాటు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత ఇలాంటి జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి రవికుమార్ మాట్లాడుతూ యువత తమ విద్యార్హతలకు అనుగుణంగా లభించే ప్రతి అవకాశాన్ని వినియోగించుకుని స్వయం ఉపాధి లేదా ఉద్యోగాలను పొందేందుకు ముందుకు రావాలని అన్నారు. టంగుటూరు తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలు నిర్వహిస్తున్న ఉపాధి కార్యక్రమాలను నిరుద్యోగ యువత తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు. టంగుటూరు ఎంపీడీఓ దేవసేన కుమారి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలను చేరువ చేయాలనే లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మాజీ సర్పంచ్ జయంత్, మాజీ సర్పంచ్ మమత, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్, రాష్ట్ర యువజన కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ నైపుణ్యాలను పెంపొందించుకొని ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని, ప్రభుత్వం మరియు ~~ఆూాూాణజ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ జాబ్ మేళాలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు పాల్గొని అభ్యర్థులకు ప్రత్యక్ష ఇంటర్వ్యూలు నిర్వహించాయి. కార్యక్రమంలో పాల్గొన్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ఈ జాబ్‌మేళా కీలక వేదికగా నిలిచింది. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సంస్థల ప్రతినిధులు, నిరుద్యోగ యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో 13 కంపెనీలు పాల్గొనగా 189 మంది హాజరవ్వగా 85 మంది ఎంపికయ్యారు.

# స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించిన ప్రకాశం జిల్లా పోలీసులు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 18)

ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్ యుగంధర్, ఎఆర్ అడిషనల్ ఎస్పీ జి నాగేశ్వరరావు, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పోలీస్ అధికారులు, సిబ్బంది స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ ప్రాంగణాలతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రపరిచి, చెత్తను తొలగించారు. పనిముట్లతో పిచ్చి మొక్కలను తొలగించారు. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్ యుగంధర్ మాట్లాడుతూ మన చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొంటుందని తెలిపారు. పరిశుభ్రమైన వాతావరణం మానసిక ప్రశాంతతను పెంపొందించి, విధులను మరింత సమర్థవంతంగా, క్రమశిక్షణతో నిర్వర్తించేందుకు దోహదపడుతుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అదే లక్ష్యంతో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం అధికారులు, సిబ్బందితో కలిసి స్వచ్ఛత కార్యక్రమాల్లో పాల్గొని, ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఆర్‌ఐ సీతారామిరెడ్డి, ఆర్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.





# అంగన్వాడీ కేంద్రాల్లో చక్కటి సేవలు అందించండి

## అధికారులు, సిబ్బందికి ఎమ్మెల్యే ఇంటూరి సూచన

## 236 కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్ లు పంపిణీ



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 18)

అంగన్వాడి కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు సేవలు అందించడంలో బాధ్యతగా ఉండాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. విద్యుత్ ఆదా చేయడంలో భాగంగా నియోజకవర్గంలోని 236 అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు, వంట పాత్రలను ఎమ్మెల్యే నాగేశ్వరరావు శనివారం పంపిణీ చేశారు. కందుకూరు సెక్టార్ పరిధిలోని వలేటివారిపాలెం మండలంలో 53 కేంద్రాలు, ఉలవపాడు సెక్టార్ పరిధిలోని మొత్తం 183 కేంద్రాలకు స్టౌలు అందించారు. కూటమి ప్రభుత్వం ఒక్కొక్క అంగన్వాడీ కేంద్రానికి సుమారు 7 వేల రూపాయల విలువ చేసే వస్తువులను అందిస్తోందని ఎమ్మెల్యే చెప్పారు. చిన్నారుల్లో పోషకాహార లోపం ఉండకూడదనే ఉద్దేశంతో అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తుందని నాగేశ్వరరావు చెప్పారు. నిధుల సద్వినియోగం జరిగేలా అధికారులు పనిచేయాలని ఆయన సూచించారు. కందుకూరు సిడిపిఓ కే ఉషారాణి, ఉలవపాడు సిడిపిఓ మాధవీలత, సూపర్వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# శ్రీ ప్రతిభ గ్రూప్స్‌లో ఘనంగా 44వ వార్షిక ఫ్రెషర్స్ డే వేడుకలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 18)

పేర్నమిట్టలోని శ్రీ ప్రతిభ జూనియర్ కళాశాల, శ్రీ గురుదత్త హై స్కూల్ ఆధ్వర్యంలో శ్రీ ప్రతిభ గ్రూప్స్ 44వ వార్షిక ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి సంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈఓ నల్లూరి జయప్రకాశ్ నారాయణ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, క్రీడా స్ఫూర్తి, వ్యక్తిత్వ వికాసం విద్యార్థుల విజయానికి బాటలు వేస్తాయని వారు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో సంస్థల అధ్యాపక బృందంతో కలిసి 2,100 మందికి పైగా విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా 2026 ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సత్కరించి బహుమతులు అందజేశారు. అలాగే ఇటీవల నిర్వహించిన స్పోర్ట్స్ వీక్ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, సంగీత ప్రదర్శనలతో సందడి చేస్తూ ఆనందోత్సాహాల మధ్య ఫ్రెషర్స్ డే వేడుకలను జరుపుకున్నారు. కొత్త విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలుకుతూ, సీనియర్ విద్యార్థులు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.










# ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 18)

జనని చారిటబుల్ ట్రస్ట్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో మొత్తం 541 మంది లబ్ధిదారులు పాల్గొన్నారు. వారిలో గత శిబిరంలో కంటి ఆపరేషన్ చేయించుకున్న 150 మందికి కంటి అద్దాలను పంపిణీ చేయడం జరిగింది. అదేవిధంగా, ఈరోజు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి హాజరైన 391 మందిలో 265 మంది కంటి ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. వీరిని శంకర్ కంటి ఆసుపత్రికి నాలుగు విడతలుగా ఉచిత కంటి ఆపరేషన్ల కోసం తీసుకెళ్లనున్నారు.

**ఆపరేషన్‌కు వెళ్లే షెడ్యూల్:**

22-07-2026 మధ్యాహ్నం 12 గంటలకు 56 మంది. 24-07-2026 మధ్యాహ్నం 1 గంటకు 56 మంది. 26-07-2026 మధ్యాహ్నం 12 గంటలకు 123 మంది. 28-07-2026 మధ్యాహ్నం 1 గంటకు 36 మంది. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో నిర్వహిస్తున్న ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

# సఖి హబ్ ఆరోగ్య భద్రత కోసం నిరంతరం పనిచేస్తుంది

## జిల్లా కోఆర్డినేటర్ వరం సునీత





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 18)

సమాజంలో మహిళల ఆరోగ్య భద్రత అత్యవసరమని, అలాంటి మహిళల ఆరోగ్య భద్రత కోసం సఖి హబ్ నిరంతరం పనిచేస్తూ ఉంటుందని సఖి హబ్ మార్కాపురం జిల్లా కోఆర్డినేటర్ వరం సునీత తెలిపారు. ఇంటి ఇల్లాలు ఆరోగ్యంగా ఉండాలని, అలాంటప్పుడే కుటుంబం కూడా ఆరోగ్యంగా ఉంటుందని, తద్వారా సమాజమే ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. శనివారం పొదిలిలోని స్థానిక గ్రాండ్ టిఐ కార్యాలయంలో సఖి హబ్ జిల్లా స్థాయి కో ఆర్డినేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వరం సునీత మాట్లాడుతూ స్త్రీ లేనిదే సృష్టి లేదని, సృష్టికి మూలం స్త్రీ కనుక అటువంటి స్త్రీల ఆరోగ్యం కోసం సామాజిక సేవా దృక్పథం కలిగిన సఖీ హబ్ ద్వారా తన నిరంతర ఆరోగ్య ఉచిత సలహా సేవా కార్యక్రమాలని విస్తృతంగా నిరంతరం పని చేస్తుందని తెలిపారు. తమ సఖి హబ్ కోఆర్డినేటర్లు మహిళలను బృందాలుగా చేసుకొని ఉచిత ఆరోగ్య సలహాలను అందించడమే కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆహారపు అలవాట్లు పరిశుభ్రత వ్యాధులు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చెబుతూ పోషక ఆహారము ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకొంటూ ఆరోగ్యంగా ఎలా జీవించాలో తెలుపుతూ పలు అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఈ కార్యక్రమంలో మహిళల ఆరోగ్యం, భద్రతపై పలు అంశాలతో పాటు మహిళల సమస్యలపై తీసుకోవాల్సిన పలు అంశాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండల బ్లాక్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# పచ్చదనాన్ని పెంపొందించడంలో సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలి

జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 18)

పచ్చదనాన్ని పెంపొందించడంలో సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దీనికి ఇస్తున్న



ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలని, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన చెప్పారు. సముద్ర తీరంలోని ప్రభుత్వ స్థలాలు, పట్టణాలలోని ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటేందుకు తీసుకోవలసిన చర్యలపై శనివారం ప్రకాశం భవనంలో ఆయన అధ్యక్షతన జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. అటవీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం చేసే ఆర్థిక సహాయం, నిబంధనలను డిఎఫ్‌వో వినోద్ కుమార్ (టెరిటోరియల్) ఈ సమావేశంలో వివరించారు. సముద్రతీర ప్రాంతంలో గ్రేట్ గ్రీన్ వాల్ నిర్మించేందుకు ప్రభుత్వ స్థలాలను గుర్తిస్తే వచ్చే ఐదేళ్లలో మొక్కలు నాటేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అదేవిధంగా 'నమో వన యోజన' పథకం కింద మున్సిపాలిటీలలో నగరవనాలు పెంచేందుకు, పాఠశాలల్లో మొక్కలు నాటేందుకు తీసుకోవలసిన చర్యలను తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ రాష్ట్రంలో హరిత విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసే ఆర్థిక సహకారాన్ని వినియోగించుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. అందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని వినోద్ కుమార్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పివి రమణ, డీఎఫ్‌వో రాజశేఖర్ (సోషల్ ఫారెస్ట్రీ), ఒంగోలు ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, జిల్లా ఉద్యానశాఖ అధికారి గోపీచంద్, డీఈవో రేణుక, డ్వామా పిడి జోసఫ్ కుమార్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీవో అనుమప, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి, తీర ప్రాంత మండలాల తహసీల్దార్లు, ఒంగోలు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## కనిగిరిలో పందుల స్వైర విహారం







(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 18)

కనిగిరి పట్టణంతో పాటు శివనగర్ కాలనీలో పందులు విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురి చేయడమే కాక అపరిశుభ్రతను కలిగిస్తున్నాయి. మురుగు కాలువలు, డ్రైన్లు శుభ్రం చేయక పోవడం వల్ల వీధులు, మురుగు కాలువల వద్ద సంచరిస్తూ దుర్వాసన వెదజల్లడంతో పాటు డెంగ్యూ, మలేరియా, వంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. పందుల పెంపకందారులు నిబంధనలకు విరుద్ధంగా జనావాసాల్లో పందులను విచ్చల విడిగా వీటిని వదిలేయడం, మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడం వల్ల ఈ సమస్య పెరుగుతుంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పందులను ఊరికి దూరంగా పెంచుకోవాలని నిబంధన ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. రాబోవు కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాన్ని ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టిలో ఉంచుకొని తగు చర్యలు తీసుకోవాలని స్థానికులుతో పాటు పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

# స్వచ్ఛ ఒంగోలు కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలి

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 18)

స్వచ్ఛ ఒంగోలు కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ కోరారు. స్వర్ణ ఆంధ్రా స్వచ్ఛ ఆంధ్రాలో భాగంగా బీకే అపార్ట్మెంట్‌లో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒంగోలు నగర అభివృద్ధి జరుగుతుందని, సుందరీకరణ కూడా జరుగుతుందని, ఇలాంటి సమయంలో స్వచ్ఛ ఒంగోలు సాధ్యం అవుతుందన్నారు. స్వచ్ఛమైన వాతావరణం ఉండటంవల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వల్ల సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఇప్పటికే ఒంగోలు నగరానికి ఒక రూపం తీసుకువచ్చామని, రోడ్లపై చెత్త వేయకుండా, గేదెలు తిరగకుండా సహకరించాలని ప్రజలను కోరారు. ఇప్పటికే ఒంగోలుకు ఒక రూపం తీసుకువచ్చామని, ప్రజలు రోడ్లపై చెత్త వేయకుండా సహకరించాలని జనార్ధన్ రావు సూచించారు. పీడీసీసీ బ్యాంకు పర్సన్ ఇంచార్జి డాక్టర్ కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ ఒంగోలు నగరంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ అభివృద్ధి మార్కు అందరం చూస్తున్నామని, స్వచ్ఛ ఒంగోలుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఇళ్ల వద్దకు వచ్చే పారిశుధ్య సిబ్బందికి తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా ఇవ్వాలన్నారు. ఒంగోలు నగరం పరిశుభ్రంగా ఉంటే అందరూ ఆరోగ్యంగా ఉంటారని, ఆసుపత్రి ఖర్చులు కూడా తగ్గుతాయని తెలిపారు. మార్పు అనేది ప్రతి ఒక్కరు తమ ఇంటి నుండే మొదలు పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ వెంకట కృష్ణయ్య, వావ్ ఐటీసీ మేనేజర్ శ్రీనివాస్, బికే ఎంక్లేవ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సరయు, సెక్రటరీ వెంకటేశ్వర్లు, టిడిపి నగర అధ్యక్షుడు బండారు మదన్, పాలూరి వెంకటేశ్వర రెడ్డి, మాజీ కార్పొరేటర్లు అంబూరి శ్రీనివాసరావు, తిప్పరపల్లి రవితేజ, చింతపల్లి గోపి, నాయకులు గడ్డం ఆదినారాయణ, ఇందుర్తి మారుతి రావు, పాలపర్తి లక్ష్మీనారాయణ, కూరపాటి కాశీ రావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రా పై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.










# టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 18)

స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ స్వయంప్రతిపత్తి డిగ్రీ కళాశాలలో శనివారం నాడు కళాశాల జాతీయ సేవా పథకం విభాగాలు, కామర్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలోని అన్ని ఇతర విభాగాల సమన్వయంతో 'స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవం" పురస్కరించుకుని 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రవికుమార్ అధ్యక్షత విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పరిశుభ్రత అనేది కేవలం ఒక రోజుతో ముగిసిపోయేది కాదని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లక్ష్యాలను ప్రతి ఒక్కరూ స్వీకరించాలని, విద్యార్థులు తమ ఇళ్లతో పాటు, కళాశాల ప్రాంగణాన్ని మరియు సమాజాన్ని స్వచ్ఛంగా ఉంచడంలో అగ్రభాగాన నిలవాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్‌వి శ్రీహరి, ఇంగ్లీష్ ఉపన్యాసకులు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి రాజగోపాల బాబు, పొలిటికల్ సైన్స్ ఉపన్యాసకులు, ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 కోఆర్డినేటర్ కోటపాటి నరేష్ రాజా, కెమిస్ట్రీ ఉపన్యాసకురాలు, ఎన్ఎస్ఎస్ యూనిట్2 కోఆర్డినేటర్ డాక్టర్ కెవి పద్మావతి, కామర్స్ ఉపన్యాసకులు డాక్టర్ ఎం శ్రీనివాసరావు, బోటనీ ఉపన్యాసకులు డాక్టర్ ఎన్ తిరుపతిస్వామిలతో పాటు కళాశాలలోని బోధన, బోధనేతర సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో కళాశాల ప్రధాన ద్వారం నుండి విద్యార్థులు, అధ్యాపకులు కలిసి ర్యాలీ నిర్వహించారు. పరిశుభ్రతపై అవగాహన కల్పించే ప్లకార్డులు ప్రదర్శిస్తూ, స్వచ్ఛ భారత్-స్వచ్ఛ ఆంధ్ర, "పరిశుభ్రతను పాటిద్దాం-ఆరోగ్యాన్ని కాపాడుకుందాం" అంటూ నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం కళాశాల ఆవరణలో పెద్ద ఎత్తున శ్రమదానం చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో అధ్యాపకుల పర్యవేక్షణలో విద్యార్థులు గ్రూపులుగా విడిపోయి, కళాశాల క్యాంపస్ లోని మియావాకీ అడవిలోని కలుపు మొక్కలను తొలగించారు. మొక్కల పాదులను శుభ్రం చేసి, నీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసిన ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రిన్సిపాల్‌కి, తోటి అధ్యాపకులకు, ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థి లోకానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.






# అంగన్‌వాడీ పాఠశాలలకు ఇండక్షన్ స్టవ్‌ల పంపిణీ



(షణ్ముఖ వెలుగు, పామూరు, జులై 18)

పిల్లలకు మెరుగైన పోషకాహారం అందించే లక్ష్యంతో పామూరు, పీసీపల్లి మండలాల అంగన్‌వాడీ పాఠశాలలకు ఇండక్షన్ స్టవ్‌లను కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ పార్టీ అధ్యక్షులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార తయారీ మరింత పరిశుభ్రంగా, వేగవంతంగా జరిగి చిన్నారులకు నాణ్యమైన సేవలు అందేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయన అభినందించారు. చిన్నారుల సంక్షేమం, మహిళా, శిశు అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.

# కనిగిరిలో ఘనంగా స్వచ్ఛంద్ర-స్వర్ణాంధ్ర

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 18)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర" కార్యక్రమం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. శనివారం నిర్వహించిన బల్క్ వేస్ట్ జనరేటర్ అవగాహన కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయసునీత, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం నుంచి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల వరకు విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, చెత్త వర్గీకరణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ వంటి అంశాల పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం దొరువు ప్రాంతంలో విద్యార్థులు, అధికారులు, సిబ్బందితో కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మొక్కలు నాటి, అక్కడి నుంచి కనిగిరి దొరువు వరకు మరో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దొరువు వద్ద విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి మానవహారం ఏర్పాటు చేసి, స్వచ్ఛత-పరిశుభ్రత పై నినాదాలతో ప్రజలను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ పర్వతనేని శ్రీధర్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, మునిసిపల్, సచివాలయ సిబ్బంది, నాయకులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.










# గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు
# కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత



**గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి పాలనలో**
**గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు**
**ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రజలంతా భాగస్వాములు కావాలి**
**పి4తో పేదరికం లేని సమాజం కోసం**
**సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారు**
**త్వరలోనే వెలుగొండకు నీళ్లిచ్చి**
**ఉమ్మడి ప్రకాశం జిల్లాను సస్యశ్యామలం చేస్తాం**
**స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మంత్రి స్వామి**

**(షణ్ముఖ వెలుగు, దర్శి, జులై 18)**

గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. శనివారం ప్రకాశం జిల్లా దర్శి మండలం తూర్పు చౌటపాలెంలో దర్శి టీడీపీ ఇంఛార్జి గొట్టిపాటి లక్ష్మీతో కలసి స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మంత్రి డిఎస్ బీవీ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి స్వయంగా చెత్త ఊడ్చి రోడ్లు శుభ్రం చేశారు. అనంతరం స్వచ్ఛతపై ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు, గ్రామంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని ఎస్సి కాలనీలో ఎంపీ యూపీ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులు, చిన్నారులతో మంత్రి ముచ్చటించారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి స్వామి మాట్లాడుతూ గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోంది. మన ఇల్లు, మన వీధి, మన గ్రామం అనే నినాదంతో ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి. ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రజలంతా భాగస్వాములు కావాలి. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి పాలనలో గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నాం. సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తున్నాం. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం, స్త్రీ శక్తి వంటి అన్ని పథకాలు అమలు చేస్తున్నాం. ఈ నెలలోనే తల్లికి వందనం నిధులు ఇవ్వబోతున్నాం. ప్రధాని మోదీ సహకారం, సీఎం చంద్రబాబు నాయుడు కృషి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తోడ్పాటుతో రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నాం. రాష్ట్రానికి పెట్టుబడుల సాధనలో మంత్రి లోకేష్ కీలకపాత్ర పోషిస్తున్నారు. వైసీపీ హయాంలో వెలిగొండ పూర్తి కాకుండానే జాతికి అంకితం చేసి ప్రజలను మోసం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యుద్ధ ప్రాతిపదికన వెలుగొండ పనులు పూర్తి చేస్తున్నాం, త్వరలోనే వెలిగొండ నీళ్లు ఇచ్చి ఉమ్మడి ప్రకాశం జిల్లాను సస్యశ్యామలం చేస్తామని మంత్రి స్వామి అన్నారు.



## పుట్టా పోలమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన ఎంపీ సీఎం రమేష్



**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 18)**

ఇటీవల పరమపదించిన మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాతృమూర్తి స్వర్గీయ పుట్టా పోలమ్మ చిత్రపటానికి అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ నాయుడు పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసానికి విచ్చేసిన ఎంపీ సీఎం రమేష్ అక్కడ ఏర్పాటు చేసిన పోలమ్మ చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు. అనంతరం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టా పోలమ్మ మరణం ఆ కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, వారి పట్ల తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని, మనోబలాన్ని ప్రసాదించాలని ఆయన ప్రార్థించారు.

## నేడు వైసీపీ ఉమ్మడి ప్రకాశం జిల్లా ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం

**ఉమ్మడి ప్రకాశం జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు కొల్లా ఉదయభాస్కర్**




**(షణ్ముఖ వెలుగు, దర్శి, జులై 18)**

రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్, పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు కుప్పం ప్రసాద్ ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం జరుగుతుందని ఉమ్మడి ప్రకాశం జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు కొల్లా ఉదయభాస్కర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని వైసీపీ పార్టీకి చెందిన ఆర్యవైశ్య సోదరులు అందరూ తప్పనిసరిగా హాజరై భవిష్యత్ కార్యాచరణ పై జరిగే చర్చలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు, ఇతర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. కావున ఈ సమావేశానికి ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఆర్యవైశ్యులందరూ హాజరై ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకం లబ్ధిదారులతో సమీక్ష



**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జులై 18)**

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన- వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకం 2025-26 లో భాగంగా హనుమంతుని పాడు మండలం హాజీపురం గ్రామంలో 30 మంది రైతులకు గడ్డి కత్తిరించే యంత్రాలు, సైలేజ్ తయారీ సంచులు, వానపాముల ఎరువు తయారీ యూనిట్లను పూర్తి సబ్సిడీపై అందజేయడం జరిగినది. ఈ పథకం నిర్వహణ, ప్రయోజనాల పై కనిగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు జైనులబ్దిన్ లబ్ధిదారులతో హాజీపురం రైతు సేవ కేంద్రం నందు సమీక్ష నిర్వహించారు. వర్షాధార ప్రాంత రైతులు కేవలం వ్యవసాయంపై ఆధారపడినట్లయితే కరువు సమయంలో వారు పూర్తిగా నష్టపోతారు. అటువంటి సమయంలో వారికి ఇతర ఆదాయ వనరులు అయినటువంటి పశు పోషణ, వానపాముల ఎరువు తయారీ లేదా తేనెటీగల పెంపకం చేపట్టినట్లయితే కరువు ప్రభావం వలన వ్యవసాయంలో నష్టం వాటిల్లినప్పటికీ ఇతర ఆదాయ మార్గాల ద్వారా జీవనోపాధి పొందవచ్చు అని తెలిపారు. ఈ పథకంలో ప్రభుత్వం ద్వారా అందిన పరికరాలను సక్రమంగా వినియోగించుకొని మంచి ఆదాయం పొందాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కుందూరు నారాయణరెడ్డి, క్లస్టర్ ఇంచార్జి గాయం తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులు చీకటి వెంకటసుబ్బయ్య, కోటపాటి శేషయ్య, నీటి సంఘం అధ్యక్షులు గాయం సుబ్బారెడ్డి, గాయం రామిరెడ్డి, తాతపూడి స్టాన్లీ జాన్, వ్యవసాయ అధికారి రవికుమార్, ఏఈఓ రసూల్, విఏఏ గాయత్రి మరియు పథక లబ్ధిదారులు పాల్గొన్నారు

## మండల విద్యాశాఖ అదనపు ఎంఈఓగా సుబ్బారావు బాధ్యతల స్వీకరణ



**(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, జులై 18)**

కొరిశపాడు మండల విద్యాశాఖ అదనపు ఎంఈఓగా సుబ్బారావు శనివారం విద్యాశాఖ కార్యాలయం నందు నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఎంఈఓ పున్నయ్య, సిబ్బంది ఆయనకు అభినందన తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తానని అన్నారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# ఘనంగా మధుర గాయని జానకకి నృత్య నివాళి

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 18)**

స్థానిక సివియన్ రీడింగ్ రూం ఆవరణలో చందూ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో త్రోవగుంట చందూ, కోవెలకుంట్ల బాలకోటయ్యల పర్యవేక్షణలో చిన్నారులు సుమారు 50 మంది శనివారం సాయంత్రం మధుర గాయని జానకి పాడిన పాటల్లో కొన్ని పాటలకు అద్భుతంగా నృత్యం చేసి ఘనంగా నీరాజనాలు అర్పించారు. అనంతరం జరిగిన సభకు ముఖ్య అతిథిగా హాజరైన నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం గౌరవ అధ్యక్షురాలు తేళ్ళ అరుణ మాట్లాడుతూ తన అపూర్వ గాన మాధుర్యంతో భారతీయ సంగీతాకాశంలో చిరస్థాయిగా వెలుగొందిన గానకోకిల, పద్మభూషణ్ అవార్డు గ్రహీత ఎస్ జానకి అకాల మరణం దేశానికి, సంగీత ప్రపంచానికి తీరని లోటని పేర్కొన్నారు. మరో ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ జానకి గురించి మాట్లాడుతూ ఆరు దశాబ్దాలకు పైగా అనేక భాషల్లో వేలాది గీతాలకు ప్రాణం పోసిన ఆమె స్వరంలో పలికిన ప్రతి గీతం ఒక భావోద్వేగం, ప్రతి రాగం ఒక మధుర జ్ఞాపకమని చెప్పారు. కళామిత్రమండలి (తెలుగు లోగిలి) జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు మాట్లాడుతూ తెలుగు సహా అనేక భారతీయ భాషల్లో ఆమె అందించిన అమూల్యమైన సంగీత సంపద తరతరాలకు మార్గదర్శకంగా నిలిచి, భారతీయ సంస్కృతికి చిరస్మరణీయ వారసత్వంగా నిలుస్తుందని తెలిపారు. శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ జానకి తన 60 సంవత్సరాల పైన సినీ జీవితంలో తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషలలో దాదాపు 50 వేలకు పైగా పాటలు పాడిందని, ఆమెకు ఉత్తమ గాయనిగా జాతీయ పురస్కారాలు 4 సార్లు, వివిధ రాష్ట్రాల నుంచి 31 సార్లు పొందారని తెలిపారు. ఇంకా కార్యక్రమంలో 'తెలికా' ఉద్యమ ప్రచారకురాలు మారేపల్లి సూర్య కుమారి, శ్రీ నాగినేని నరసింహారావు మెమోరియల్ సంస్థ అధ్యక్షులు మిడసల మల్లిఖార్జునరావు, ప్రముఖ కవి యువి రత్నం, ధేనువకొండ సుబ్బారావు, కేయస్వీ ప్రసాద్, గుంటూరు సత్యనారాయణ, పరాంకుశం కృష్ణవేణి, రామచంద్రుని లక్ష్మీ, బీరం అరుణ, ఓరుగంటి ప్రసాద్ తదితరులు పాల్గొని ఆ మహనీయురాలి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమం అంతా నృత్య విద్యార్థుల తల్లిదండ్రుల ప్రోత్సాహంతో జరిగింది.





## అమరావతి ఛాంపియన్ షిప్ 2026 పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ ఎం విజయ సునీత



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 18)**

మార్కాపురం కలెక్టరేట్లో శనివారం అమరావతి ఛాంపియన్ షిప్-2026 పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్ బాల్, చెస్, హాకీ, కబడ్డీ, కోకో, వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్, యోగ వంటి పోటీలు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. విద్యాశాఖ, స్పోర్ట్స్ అథారిటీ సహకారంతో వివిధ స్థాయిల్లో ఈ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఈ క్రీడలు నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని రాణించాలని, జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కలెక్టర్‌కోరారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ, స్పోర్ట్స్ అథారిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# హ్యాట్సాఫ్ ఉద్యోగ సమాచార్
# ఉద్యోగ సమాచార్‌కు అభినందనల వెల్లువ



**(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 18)**

మార్కాపురం జిల్లా కేంద్రంలో గత రెండు సంవత్సరాలుగా ఉద్యోగ సమాచార్‌ను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతి, యువకులకు ఉద్యోగాలు కల్పిస్తున్న ఉద్యోగ సమాచార్ ఎండి షేక్ సాజిద్‌ను గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఆయన తనయులు యరపతినేని నిఖిల్ ప్రశంశించారు. శనివారం పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసులు, యువ నాయకులు యరపతినేని నిఖిల్ పాల్గొని మెగా జాబ్ మేళా ప్రారంభించారు. ఈ జాబ్ మేళాలో ఉద్యోగ సమాచార్ నుండి సంస్థ ఎండి షేక్ సాజిద్ ఉద్యోగ సమాచార్ నుండి 35 మంది నిరుద్యోగులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే, ఆయన తనయులు యరపతినేని నిఖిల్ మాట్లాడుతూ ఉద్యోగ సమాచార్ ద్వారా నిరుద్యోగ యువతి యువకులకు ఉద్యోగాలు అందజేయడం హర్షనియమనీ, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు.



## రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్లకు కౌన్సిలింగ్ నిర్వహించాలి

## మహిళా భద్రత పై గ్రామాలు, కాలనీలలో, పాఠశాలలు, కళాశాలల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలి

## జిఎంఎస్‌కెల భాగస్వామ్యంతో మరింత విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలి

## సబ్ డివిజన్ నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

# ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల పై ప్రత్యేక దృష్టి సారించాలి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జులై 18)

ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల పై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశించారు. రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్లు, గతంలో నేరాలకు పాల్పడిన వారి కదలికల పై ప్రత్యేక నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పులివెందుల సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహిళా భద్రతపై గ్రామాలు, కాలనీలు, పాఠశాలలు, కళాశాలలల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పోలీస్ అధికారులను ఆదేశించారు. స్మార్ట్ పోలీసింగ్ ఇండికేటర్స్, ఈ-సాక్ష్య, సిసిటిఎన్ఎస్, ఈ-సమ్మన్స్, ఈ-ప్రాసిక్యూషన్స్ తదితర మాడ్యూల్స్ పై పట్టు పెంచుకుని ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని సూచించారు. సోషల్ మీడియా వల్ల కలిగే మహిళలు, బాలికల వేధింపులపై స్కూళ్ళు, కాలేజీలలో అవగాహన కల్పించాలన్నారు. మహిళా భద్రత పై, మహిళల రక్షణకు ప్రత్యేకంగా ఉన్న చట్టాల పై గ్రామాలు, కాలనీలలో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే గస్తీని పెంచాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరిగేందుకు కారణాన్ని గుర్తించి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్, అధిక వేగంతో వెళ్లే వాహనాల పై, మైనర్ డ్రైవింగ్, రాష్, నిర్లక్ష్య డ్రైవింగ్ పై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేయాలన్నారు. వాహనాల రికార్డులు తనిఖీ చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి వాస్తవాలను నిర్ధారించుకుని నిర్ణీత వ్యవధిలోగా చట్టపరిధిలో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. గ్యాంబ్లింగ్, మట్కా, క్రికెట్ బెట్టింగ్ జరగకుండా కఠినంగా వ్యవహరించాలని, దాడులు ఉధృతం చేయాలని ఆదేశించారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి గస్తీని పెంచడంతో పాటు గ్రామ సభలు, పల్లె నిద్ర, గ్రామాల సందర్శన తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ కేసులలో త్వరితగతిన దర్యాప్తు పూర్తిచేయాలని ఆదేశించారు. వైట్ కాలర్ (చీటింగ్) నేరాలకు సంబందించిన కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించారు. డ్రోన్ కెమెరాల ద్వారా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, బహిరంగ మద్యపానం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి పై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. 'శక్తి' టీముల డే బీట్స్ పర్యవేక్షిస్తూ స్కూళ్ళు, కాలేజీలు, ఆఫీస్‌లు, వ్యాపార సముదాయాల వద్ద, రద్దీ ప్రాంతాలలో తప్పనిసరిగా పోలీస్ సిబ్బంది బీట్లు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. మహిళలు, బాలికలు వేధింపులకు గురయ్యే ప్రాంతాలలో మ్యాపింగ్ చేయించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బీట్లు నిర్వహించాలన్నారు. దొంగతనాల నేర చరిత్ర కలిగిన వారి కదలికల పై నిఘా ఉంచాలని, వివిధ రకాలైన, వివిధ ప్రాంతాలలో జరిగే దొంగతనాలను మ్యాపింగ్ చేసి సదరు ప్రాంతాలలో గస్తీ ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో పులివెందుల డిఎస్పీ మురళి నాయక్, సబ్ డివిజన్‌లోని సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.





## త్రిపురాంతకేశ్వరస్వామిని దర్శించుకున్న యువనేత కందుల విగ్నేష్‌రెడ్డి







(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, జులై 18)

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుమారుడు యువ నేత కందుల విగ్నేష్‌రెడ్డి శనివారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన త్రిపురాంతకంలోని శ్రీశ్రీశ్రీ త్రిపురాంతకేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి స్వామి, అమ్మవార్ల వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మిత్ర బృందం పాల్గొన్నారు.

# క్రాంతి మాదిగ కేసులో సిఐ నాగరాజును అరెస్టు చేయాలి

### సెక్షన్లు మార్చి రెండు వారాలైన అరెస్టు చేయలేదు

### విజయవాడ డిసిపి సరితకు దళిత నాయకుల ఫిర్యాదు

### ఏసీపికి మెమో ఇచ్చి చర్యలు తీసుకుంటామన్న డిసిపి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 18)

విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్లో సిఐ నాగరాజు వేధింపులు, పోలీసు హింస, అవమానాలు భరించలేక బలవన్మరణం పొందిన క్రాంతి మాదిగ కేసులో సిఐ నాగరాజును వెంటనే అరెస్టు చేయాలని విజయవాడ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సరితకు దళిత నాయకులు కొరివి వినయ్ కుమార్, నీలం నాగేంద్రరావు, కరువాది సుబ్బారావు, మేళం భాగ్యరావు, పేరుపోగు వెంకటేశ్వరరావులు ఫిర్యాదు చేశారు. శనివారం సాయంత్రం విజయవాడ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో డీసీపీ సరితను కలిసి క్రాంతి కుమార్ మాదిగ బలవన్మరణం కారకుడైన సీఐ నాగరాజు అరెస్టు పై చర్చించారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్లో పేరీపోగు క్రాంతి మాదిగ అనే యువకుడ్ని సిఐ నాగరాజు పోలీస్ స్టేషన్కు పిలిపించి మరుగుదొడ్లు కడిగించి బూటు పాలిష్ చేయమని మాదిగ నా కొడకా పాలిష్ చేయటం రాదంటరా అంటూ కులం పేరుతో తిట్టి అవమానించారన్నారు. ఈ ఘటనలో ఈ నెల 4వ తేదీన విజయవాడ కమిషనర్ రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు ఉత్తర ఏసిపి సత్యానంద్ ఎస్సీ, ఎస్టీ యాక్ట్, బిఎన్ఎస్ 108 బలవన్మరణం కేసులుగా సెక్షన్లుగా మార్చారన్నారు. అదే కృష్ణలంక పోలీస్ స్టేషన్లో సిఐ నాగరాజు చే లాకప్ డెత్ కు గురై శవం కూడా కనిపించని కేసులో తల్లి విజయలక్ష్మి ఆరోపిస్తున్నట్లు బూడిద కూడా ప్రభుత్వం చూపించలేని కేసులో కృష్ణలంక సీఐ నాగరాజు ఇప్పటికీ అరెస్టయి రాజమండ్రి జైల్లో రిమాండ్‌లో ఉంటున్నారన్నారు. కావున క్రాంతి కుమార్ మాదిగ కేసులో సెక్షన్లు మార్చి రెండు వారాలైన ప్రధాన నిందితుడు నాగరాజును అరెస్టు చేయలేదన్నారు. విజయవాడ కోర్టులో పిటిషన్ వేసి రాజమండ్రి జైల్లో ఉన్న పూర్వపు సిఐ నాగరాజును క్రాంతి కుమార్ మాదిగ కేసులో కూడా అరెస్టు చేసి విచారణ జరిపించాలని, మిగతా పోలీస్ అధికారులను కూడా అరెస్టు చేయాలని దళిత నాయకులు కొరివి వినయ్ కుమార్, నీలం నాగేంద్రరావు, మేడం భాగ్య రావు తరువాత సుబ్బారావు, ఆంద్రా మాల్యాద్రిలు డిసిపి సరితను డిమాండ్ చేశారు. అంతట విజయవాడ డిసిపి సరిత క్రాంతి కుమార్ మాదిగ అరెస్టు కేసులో నాగరాజుతో పాటు ముద్దాయిల అరెస్టు పై ఉత్తర ఏసిపి సత్యానంద్‌కు మెమో ఇస్తున్నట్లు దళిత నాయకులకు తెలిపారు. క్రాంతి మాదిగ కేసులో సీఐ నాగరాజు బృందాన్ని అరెస్టు చేసి కలెక్టరేట్‌కు రిపోర్టు త్వరగా పంపించాలని బాధితుని తండ్రి పేరుపోగు వెంకటేశ్వరరావు కుటుంబానికి ప్రభుత్వపరంగా పునరావాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలని మరోసారి దళిత నాయకులు డీసీపీ సరితకు విజ్ఞప్తి చేశారు.

## దత్తత బంగారు కుటుంబాలకు అండగా విక్రమ్ నారాయణరావు

## ముగ్గురు విద్యార్థుల ఫీజులు అందజేత



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జులై 18)

భవిష్యత్‌లో ఈ రాష్ట్రంలో పేదవాళ్లు లేకుండా చేయాలని లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమంలో భాగంగా తన దత్తత తీసుకున్న పెదగంజాం పంచాయతీ కోత్త గోల్లపాలెం బంగారు కుటుంబల్లోని ముగ్గురు విద్యార్థులకు పారిశ్రామికవేత్త లాయిడ్ సంస్థ అధినేత గోనసపూడికి చెందిన విక్రమ్ నారాయణరావు స్కూల్ పీజులు చెల్లించి వారి కుటుంబాలకు అండగా నిలబడ్డాడు. శనివారం ఉప్పుగుండురు నందు గల ఆక్స్ఫర్డ్ హైస్కూల్ కు మర్గదర్శి నారాయణరావు ప్రతినిధులైన కోట్రగుంట శ్రీహరిబాబు, వెంకట్రావుతో ఎపిఎమ్ సుబ్బారావు కలసి వెళ్ళి తొమ్మిది, పది విద్యార్థులైన ఎల్లావుల గణేష్, మధ్యన నాగార్జున, కిలారి పద్మలకు లక్ష యాబై వేల రూపాయలు పీజు చెల్లించారు. ఈ సందర్భంగా ఏపీఎం సుబ్బారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సమక్షంలో కొత్త గొల్లపాలెం గ్రామాన్ని విక్రమ్ నారాయణరావు దత్తత తీసుకొని సదరు గ్రామన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. గ్రామ మౌలిక వసతులతో పాటు ప్రజల జీవన ప్రమణాలు పెంచే కార్యక్రమంలో భాగంగా పిల్లల యొక్క జీవితాలను బంగారు జీవితాలుగా తీర్చిదిద్దటం కై విద్యాకు అందిస్తున్న సహకారం, కృషి అమోఘం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కోంద్రగుంట శ్రీహరిబాబు, వెంకట్రావు, ఎపిఎమ్ జి పెద సుబ్బారావు, కొత్త గొల్లపాలెం గ్రామస్తులు మల్లికార్జున, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com